క్లుప్తంగా

జాతీయ రహదారిపై ముంపునీరు మళ్లింపు

మామిడికుదురు: పాశర్లపూడి బరోడా బ్యాంకు సమీపాన 216వ నంబర్ జాతీయ రహదారిపై ముంపు నీరు భారీగా నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఏర్పడిన గోతిలో పడి గాయపడుతున్నారు. దీనిపై పలు పత్రికల్లో కథనాలు రావడంతో జాతీయ రహదారుల విభాగం అధికారులు స్పందించారు. ముంపునీటి మళ్లింపునకు గురువారం చర్యలు చేపట్టారు. జేసీబీతో రోడ్డు పక్కన కచ్చా డ్రైన్ తరహాలో తవ్వి తూరలు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా ముంపు నీటిని స్థానికంగా ఉన్న డ్రైన్‌లోకి మళ్లించారు. దీంతో ఇక్కడ ముంపు సమస్యకు పరిష్కారం లభించిందని వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేశారు.

ముంపునీటిని తొలగింపు పనుల పరిశీలన

అయినవిల్లి: భారీ వర్షాలకు నేదునూరు, అయినవిల్లి, సిరిపల్లి, విలస గ్రామాలకు సంబంధించిన సుమారు 750 ఎకరాల ఆయకట్టు ముంపు బారిన పడింది. ఈ నీరు కుమ్మరి కాలువ నుంచి దిగాల్సి ఉంది. ఈ కాలువ పూడుకుపోయింది. దీంతో ముంపు నీటిని మళ్లించేందుకు అధికారులు పొక్లెయిన్‌తో ఈ కాలువలో పూడిక తొలగిస్తున్నారు. ఈ పనులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు గురువారం పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి వై.శోభ తదితరులు పాల్గొన్నారు.

హై ఓల్టేజీతో కాలిపోయిన గృహోపకరణాలు

మామిడికుదురు: నగరం గ్రామంలో జెడ్పీ హైస్కూలు సమీపాన విద్యుత్ హై ఓల్టేజీ కారణంగా గురువారం పలు ఇళ్లలో గృహోపకరణాలు కాలిపోయాయి. ఒక్కసారిగా హై ఓల్టేజీ రావడంతో తమ ఇంట్లో ఉన్న మీటరు నుంచి మంటలు వచ్చాయని ఆ ప్రాంతానికి తాడి మధుకుమార్ చెప్పారు. మంటలు ఆరకపోవడంతో ఇసుక చల్లామన్నారు. మీటరు, స్టెబిలైజరు కాలిపోయాయని వాపోయారు. అల్తాఫ్ హుస్సేన్ ఇంట్లో ఇన్వర్టర్, కొమ్మూరి నాగమహేశ్వరరావు ఇంట్లో మోటారు, ఫ్రిజ్, దాకే రమణ కూల్‌డ్రింక్ షాపులో రెండు ఫ్రిజ్‌లు కాలిపోయాయి.

ఈ-స్టాంపింగ్ సర్వీసు ప్రారంభం

రాజోలు: స్థానిక కోర్టు కాంప్లెక్స్ ఎదురుగా ఈ-స్టాంపింగ్ సర్వీసును రాజోలు సబ్ రిజిస్ట్రార్ ఎ.శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. స్టాంప్ వెండర్ బొల్లాప్రగడ నాగమణికి ఈ-స్టాంపింగ్ సర్వీసు మంజూరైంది. స్టాక్ హోల్డింగ్ కంపెనీ ద్వారా ఒప్పందం చేసుకుని ప్రభుత్వం ఈ-స్టాంపింగ్ ప్రక్రియను అమలులోకి తెచ్చిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ కోరారు. మండలంలో తొలి ఈ-స్టాంపింగ్‌ను వ్యాపారవేత్త పట్నాల దత్తాత్రేయకు అందజేశారు.

రక్షిత నీటి పథకానికి శంకుస్థాపన

రాజోలు: శివకోటి పల్లిపాలెంలో రక్షిత తాగునీటి పథకం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు గురువారం శంకుస్థాపన చేశారు. రూ.23 లక్షలతో 60 వేల లీటర్ల సామర్థ్యంతో ఇక్కడ ట్యాంకు నిర్మిస్తున్నామని ఈ సందర్భంగా చెప్పారు. శివారు ప్రాంతాలకు రక్షిత తాగునీరు అందించేందుకు పైప్ లైన్లు, ట్యాంకుల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, సర్పంచ్‌లు నక్కా రామారావు, రేవు జ్యోతి, రాజోలు సొసైటీ అధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించాలి

అంబాజీపేట: జగనన్న గోరుముద్ద పథకం కింద మధ్యాహ్న భోజనంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూను సక్రమంగా పాటించాలని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంఈఓ మోకా ప్రకాష్ అన్నారు. అంబాజీపేట నాగమల్లిచెట్టు వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలను గురువారం వారు సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జయప్రదం చేయాలి

రావులపాలెం: వచ్చే నెల 21, 22 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఏపీఎన్జీఓ సంఘం కొత్తపేట తాలూకా యూనిట్ అధ్యక్షుడు మోటూరి రామారావు కోరారు. ఊబలంక పీహెచ్‌సీలో గురువారం యూనిట్ నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి నల్లా వెంకటరామారావు, ట్రెజరర్ కె.శామ్యూల్‌రాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పిచ్చికుక్కల స్వైరవిహారం

అంబాజీపేట: మండలంలోని మాచవరం, వాకలగురవు, పసుపల్లి, గంగలకుర్రు అగ్రహారం, చిరతపూడి గ్రామాల్లో గురువారం పిచ్చికుక్కలు దాడి చేయడంతో 12 మంది గాయపడ్డారు. అంబాజీపేట, అమలాపురం ఏరియా ఆస్పత్రిలో క్షతగాత్రులు వైద్యం చేయించుకున్నట్టు బంధువులు తెలిపారు. పిచ్చికుక్కలను తక్షణమే అరికట్టాలని సంబంధిత అధికారులను ప్రజలు కోరుతున్నారు.


మామిడికుదురు: ముంపునకు గురైన అప్పనపల్లి కాజ్‌వే


పి.గన్నవరం: ఎన్డీఆర్‌ఎఫ్ బోటులో బూరుగులంక వెళ్తున్న ఆర్డీఓ ముక్కంటి, తహసీల్దార్ ఠాగూర్


పి.గన్నవరం: బూరుగులంకలో పడవపై వెళ్తున్న విద్యార్థులు, ప్రజలు


పి.గన్నవరం: ఊడిమూడిలంకకు తరలిస్తున్న వాటర్ టిన్నులు

ఉగ్ర గోదావరి

- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి పాయలు
- లంకలను చుట్టుముట్టిన వరద
- ముంపు బారిన లోతట్టు ప్రాంతాలు, కాజ్‌వేలు
- అప్రమత్తంగా ప్రభుత్వ యంత్రాంగం
- ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన
- బాధితులకు భరోసా


అయినవిల్లి: ప్రయాణికులను ట్రాక్టర్‌పై ముక్తేశ్వరం కాజ్‌వే దాటిస్తున్న దృశ్యం

మామిడికుదురు/పి.గన్నవరం/అయినవిల్లి/సఖినేటిపల్లి/రాజోలు/రావులపాలెం/ఆలమూరు/ఆత్రేయపురం: గోదావరికి వరద పోటెత్తుతూండటంతో అధికారులు, లంక గ్రామాల్లోని ప్రజలు గురువారం అప్రమత్తమయ్యారు. తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. గౌతమి, వైనతేయ, వశిష్ట గోదావరి పాయలు పోటెత్తి ప్రవహిస్తుండటంతో ఏటిగట్ల భద్రతకు చర్యలు చేపట్టారు. సహాయ, పునరావాస ఏర్పాట్లు చేపట్టారు.

- మామిడికుదురు మండలం పాశర్లపూడి బ్రిడ్జి వద్ద వరద నీరు పరవళ్లు తొక్కుతోంది. అప్పనపల్లి కాజ్‌వే ముంపున బారిన పడింది. మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువన కాజ్‌వే వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, పెదపట్నం గ్రామాలతో పాటు పాశర్లపూడి పల్లవపాలెం, పాశర్లపూడిలంక శ్రీరామ్‌పేట ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. అప్పనపల్లి, బి.దొడ్డవరం గ్రామాల్లో కొబ్బరి తోటలు ముంపు బారిన పడ్డాయి. లంక గ్రామాల్లో సహాయ, పునరావాస చర్యలపై తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు సమీక్షించారు. పెదపట్నంలంక, బి.దొడ్డవరం, అప్పనపల్లి, పాశర్లపూడి గ్రామాల్లో పర్యటించి, పునరావాస కేంద్రాలకు ఎంపిక చేసిన భవనాలను పరిశీలించారు. బాధితులకు వారి గ్రామాల్లోనే వంటలు చేసి, భోజనం అందించేలా ఏర్పాట్లు చేపట్టారు. గ్యాస్ సిలిండర్లతో పాటు తాగునీటిని, డీజిల్‌ను లంక గ్రామాల్లో సిద్ధం చేశారు. పరిస్థితిని పూర్తిగా అంచనా వేసిన తర్వాత కూరగాయలు, నిత్యావసరాలను అందుబాటులో ఉంచడంపై తుది నిర్ణయం తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు.
- పి.గన్నవరం మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలతో పాటు, పశ్చిమ గోదావరి జిల్లా సరిహద్దులోని పెదమల్లంక, అనగర్లంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై ఐదడుగుల ఎత్తున వరద నీరు ప్రవహిస్తోంది. ఇక్కడ అధికారులు ఇంజిన్ బోట్లు ఏర్పాటు చేశారు. బూరుగులంక రేవులో 20 మందితో ఎన్డీఆర్‌ఎఫ్ బృందాన్ని, రెండు హైస్పీడ్ బోట్లను అందుబాటులో ఉంచారు. ఊడిమూడిలంక, జి.పెదపూడి లంక గ్రామాల్లోని పునరావాస కేంద్రాలను కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, మండల ప్రత్యేక అధికారి తిక్కా వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణ చక్రవర్తి, ఆర్‌ఐ పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.
- పి.గన్నవరం మండలం జి.పెదపూడి శివారు బూరుగులంక రేవు వద్ద వరద ఉధృతిని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పరిశీలించారు. పడవలపై ప్రయాణించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లంక గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించాలని ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది, పోలీసు సిబ్బందికి సూచించారు. లంకలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.
- పి.గన్నవరం మండలం పెదపూడిలంక, ఊడిమూడిలంక, బూరుగులంక గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఎం.దుర్గారావుదొర పరిశీలించారు. గ్రామంలోని గర్భిణులు, బాలింతలు, మంచంపై ఉన్న రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వైద్యాధికారి డాక్టర్ కె.సుబ్బారాజు తదితరులు పాల్గొన్నారు.
- అయినవిల్లి మండలం ముక్తేశ్వరం - అయినవిల్లిలంక మధ్య వెదురుబిడెం కాజ్‌వేపై మోకాలి లోతు వరద నీరు ప్రవహిస్తోంది. దీనిపై ప్రయాణికులు కొట్టుకుపోకుండా అధికారులు రోప్‌లు ఏర్పాటు చేశారు. వారిని ట్రాక్టర్లు, పడవలపై దాటిస్తున్నారు. కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పరిశీలించారు. అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, మడుపల్లి, చింతనలంక, శానపల్లిలంక, తొత్తరమూడి కె.పెదలంక, పొట్టిలంక, కొండుకుదురులంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు వరద నీట మునిగాయి. ఇక్కడి పశువులను, వ్యవసాయ ఉత్పత్తులను ఇప్పటికే మెరకకు తరలించారు. ముక్తేశ్వరం వృద్ధ గౌతమి పాయలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ముక్తేశ్వరం - కోటిపల్లి రేవులో పంట్లు, పడవలపై రాకపోకలు నిలిచిపోయాయి.
- సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంక వద్ద గోదావరి పాయకు చేర్చి ఉన్న లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు పోటెత్తింది. టేకిశెట్టిపాలెం వద్ద ఏటిగట్టు దిగువ నుంచి అప్పనరామునిలంక గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలో గోదావరి పాయ(బాడి కాలువ)పై కొత్తగా ఎత్తుగా నిర్మించిన కాజ్‌వే వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచాయి. టేకిశెట్టిపాలెం వైపు ఉన్న అగ్నికుల క్షత్రియ కాలనీ ఇళ్ల వద్ద వరద నీటిమట్టం పెరిగింది. అప్పనరామునిలంక గ్రామ శివారున కొత్తలంకలోని నెహ్రూ సుమారు 200 ఎకరాల సీసీఎఫ్ సొసైటీ భూముల్లోకి వరద నీరు చేరింది. సఖినేటిపల్లి వైపు కూడా గతంలో బాడి కాలువపై నిర్మించిన లో లెవెల్ కాజ్‌వేపై వరద నీరు ప్రవహిస్తోంది. దీని మీదుగానే అప్పనరామునిలంక వాసులు, ఇతరులు ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్నారు. సఖినేటిపల్లి లాకుల వద్ద ఏటిగట్టు దిగువన గోదావరి పాయకు చేర్చి ఉన్న లాకుపేటలోని ఇళ్లను కూడా వరద నీరు చుట్టుముట్టింది.
- పి.గన్నవరం, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లోని అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల వద్ద, ఏటిగట్టు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లోకి హెడ్‌వర్క్స్ అధికారులు మూడు రోజులుగా ఇసుక మూటలను ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. ప్రస్తుత వరద వలన ఎటువంటి ప్రమాదమూ లేదని ఏఈ టీవీఎల్ఎస్ మూర్తి తెలిపారు. ఇసుక మూటలతో పాటు, సర్వే బాదులు, బోట్లు, ఈతగాళ్లను సిద్ధం చేశామన్నారు. రాజోలునున్న వారి బాడవ శివారున వరద నీరు పైకి రావడంతో కొంతమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు తెలిపారు.
- వరద మరింత పెరిగే అవకాశం ఉందన్న హెచ్చరికలతో రావులపాలెం మండలంలోని రైతులు తమ పంటలకు రక్షణ చర్యలు చేపట్టారు. గోదావరి పాయలను ఆనుకుని దిగువ లంక పొలాలు ముంపు బారిన పడ్డాయి. రైతులు అరటి గెలలను నావలపై ఒడ్డుకు చేరుస్తున్నారు. మత్స్యకారులు తమ పడవలను ఒడ్డుకు తరలించారు.
- ఆలమూరు మండలం చెముడులంక, బడుగువానిలంక సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాస్, దూలం వెంకటలక్ష్మి, తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ జాన్‌లింకన్ తదితరులు ఆ గ్రామాలతో పాటు మూలస్థాన అగ్రహారం తదితర వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. చెముడులంకలోని శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపాన్ని పునరావాస కేంద్రంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. బడుగువానిలంకలో 4 వేల మంచినీటి ప్యాకెట్లు సిద్ధం చేశామన్నారు.
- ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక శివారు ప్రాంతమైన పిచ్చుకలంకలో ఎంపీడీఓ నాతి బుజ్జి, ఈఓపీఆర్ ఆర్డీ యు.చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వై.శ్రీధర్ పర్యటించారు. పారిశుద్ధ్యం, తాగునీటి ఏర్పాటు, వైద్య శిబిరాలపై సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందజేశారు.

వరదను సమర్థంగా ఎదుర్కొంటాం


బి.దొడ్డవరంలో వరద పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

మామిడికుదురు: వరదలను సమర్థంగా ఎదుర్కొనేందుకు కార్యాచరణ చేపట్టామని కలెక్టర్ హిమాన్షు శుక్లా చెప్పారు. బి.దొడ్డవరం, పెదపట్నంలంక, అప్పనపల్లి గ్రామాల్లో పర్యటించారు. వరద బాధితుల పునరావాసానికి గుర్తించిన భవనాలను పరిశీలించారు. వరద తగ్గే వరకూ కేటాయించిన లంక గ్రామాల్లోనే అధికారులు, ఉద్యోగులు నివాసం ఉండాలని ఆదేశించారు. పునరావాసానికి ముంపు సమస్య లేని ప్రాంతాలను గుర్తించాలని, అక్కడే వంట చేసి బాధితులకు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. బి.దొడ్డవరంలో నదీపాతం తీవ్రంగా ఉందని సర్పంచ్ చెల్లుబోయిన రామ శివసుబ్రహ్మణ్యం చెప్పారు. దీనిపై గతంలో ఇచ్చిన వినతి పత్రాన్ని కేంద్రానికి పంపించామని కలెక్టర్ చెప్పారు. ఆయన వెంట ఆర్డీఓ వసంతరాయుడు, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.


మామిడికుదురు: బి.దొడ్డవరంలో ముంపు బారిన కొబ్బరి తోటలు


సఖినేటిపల్లి: టేకిశెట్టిపాలెం వద్ద ఏటిగట్టు దిగువన కొత్తగా నిర్మించిన కాజ్‌వే వద్ద వరద ఉధృతి



రాజోలు: సోంపల్లిలో ఇసుక మూటలు సిద్ధం చేసి ట్రాక్టర్లపై లోడు చేస్తున్న కూలీలు


రావులపాలెం: ఊబలంక వద్ద పడవలను ఒడ్డుకు చేర్చిన మత్స్యకారులు

పేదల ముంగిట్లోకి పథకాలు


ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలతో పేదల ముంగిట్లోకి పథకాలు చేరుతున్నాయని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. రెండో రోజైన గురువారం మోరిపోడులో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి ఆయా కుటుంబాలకు సీఎం జగన్ పాలనలో అందించిన సంక్షేమ ఫలాలను వివరించే బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భవిష్యత్తులో పేదలకు అవసరమయ్యే మరిన్ని పథకాల రూపకల్పనకు సీఎం జగన్ చర్యలు తీసుకుంటారని, చెప్పారు. ప్రజల సంక్షేమం కోసం మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే చూడాలని ఎమ్మెల్యే రాపాక కోరారు. కార్యక్రమంలో రాజోలు ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు ముప్పర్తి నాగభూషణం, వీవర్స్ సొసైటీ చైర్మన్ జాన శంకరరావు, పీఏసీఎస్ అధ్యక్షులు ముప్పర్తి త్రిమూర్తులు, కూనపరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చెప్పింది చెప్పినట్టు అమలు చేసిన సీఎం


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: ఎన్నిక సమయంలో ప్రజలకు చెప్పింది చెప్పినట్టు సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. వీరవల్లిపాలెంలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కరోనా వంటి విపత్తుల సమయంలోనూ ప్రజలకు సీఎం జగన్ అండగా నిలిచారని గుర్తు చేశారు. ఆయనపై బురద జల్లేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, వీటిని తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుది శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో దాడులపై నిరసన


ఆర్డీఓ కార్యాలయం వద్ద దళిత నాయకులు, విద్యార్థుల ధర్నా

కొత్తపేట: మణిపూర్‌లో కుకీ తెగ గిరిజనులపై దాడులను ఖండిస్తూ గురువారం కొత్తపేటలో ఆందోళన చేశారు. మండల దళిత ఐక్య వేదిక, మాల మహానాడు, అంబేడ్కర్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఎస్ఎఫ్) ఆధ్వర్యాన దళిత నాయకులు, వివిధ కళాశాలల విద్యార్థులు స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ, మణిపూర్‌లో మూడు నెలలుగా వేలాది మంది గిరిజన క్రైస్తవులపై జరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారాలకు పాల్పడటం అత్యంత హేయమని ఖండించారు. మత స్వేచ్ఛను, మత సామరస్యాన్ని కాపాడాలని, గిరిజన క్రైస్తవులపై దాడులను అరికట్టి, రక్షణ కల్పించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం భారీ ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని, కొంతసేపు ధర్నా చేశారు. కార్యాలయం ఏఓ మాధురికి మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, దళిత ఐక్య వేదిక అధ్యక్షుడు మోర్త వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్, మాల మహానాడు జిల్లా కార్యదర్శి జక్కల అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

కలాం సేవలు చిరస్మరణీయం


పి.గన్నవరం సీహెచ్‌సీలో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి


కొత్తపేటలో కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న డీఐఈఓ సత్యనారాయణరెడ్డి

పి.గన్నవరం: ప్రముఖ శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన స్థానిక సీహెచ్‌సీలో కలాం చిత్రపటానికి విప్పర్తి గురువారం పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆస్పత్రిలో బాలింతలు, గర్భిణులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అప్పారి సూర్యనారాయణ, ట్రస్టు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కలాం స్ఫూర్తితో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కొత్తపేట: మాజీ రాష్ట్రపతి కలాం స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి (డీఐఈఓ) ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి అన్నారు. కలాం వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆ మహనీయుని విగ్రహానికి డీఐఈఓ, ప్రిన్సిపాల్ కారెం రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఎదగడానికి సాధన చేయాలని ఉద్బోధించారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కలాం చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సస్యరక్షణ చేపట్టాలి

ఆత్రేయపురం: రైతులు సస్య రక్షణ చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి జె.పట్టాభిరామయ్య సూచించారు. కట్టుంగ, ఆత్రేయపురం తదితర గ్రామాల్లో పంటలను గురువారం ఆయన పరిశీలించారు. మొదటి దఫా పొటాష్ ఎరువులు వేయడంతో పైరు ఏపుగా పెరుగుతోందని చెప్పారు. మండలంలోని సుమారు 5 వేల ఎకరాల్లో నాట్లు పూర్తి చేశారన్నారు. వరిలో కలుపును నివారించగలిగితే దిగుబడి చాల వరకూ పెంచుకోవచ్చని చెప్పారు. కలుపు నివారణకు నాట్లు వేసిన 3 నుంచి 5 రోజుల లోపు అక్సాడియార్జిల్ (టాప్‌స్టార్) మందు 35 గ్రాములు ఒక లీటరు నీరు, 20 కిలోల ఇసుకలో కలిపి ఎకరం పొలంలో సమానంగా చల్లాలని సూచించారు. కలుపు మందు వేసేటప్పుడు పలచగా నీరుండేటట్టు చూసుకోవాలని, మందు వేసిన రెండు మూడు రోజుల వరకూ చేలో నీరు నిలగట్టాలని తెలిపారు. గడ్డి జాతి కలుపు నివారణకు నాటిన 15 నుంచి 20 రోజుల్లోగా సైహలోఫాస్ బ్యూటైల్ 250 నుంచి 300 మిల్లీలీటర్ల మందును ఒక ఎకరానికి చల్లాలని చెప్పారు. అలాగే ఫినాక్స్, ప్రోప్ ఈథైల్ మందును ఎకరానికి 250 మిల్లీలీటర్లు చల్లాలన్నారు. పొలంలో నాట్లు వేసేటప్పుడు నీరు పలచగా ఉండాలన్నారు. పిలక దశలో 2 సెంటీమీటర్లు, చిరుపొట్ట దశలో గింజ గట్టి పడే వరకూ 5 సెంటీమీటర్ల వరకూ నీటిని ఉంచాలని తెలిపారు. కోతకు వారం రోజుల ముందు నుంచి నీరు నెమ్మదిగా తగ్గించి ఆరబెట్టాలని పట్టాభిరామయ్య చెప్పారు.

రైతులకు సబ్సిడీపై ఎరువులు

కొత్తపేట: సాగుకు కావాల్సిన ఎరువులను కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోందని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి పొట్లూరి రామ్మోహన్, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ అన్నారు. బీజేపీ స్వచ్ఛభారత్ రాష్ట్ర కన్వీనర్ పాలూరి సత్యానందం ఆధ్వర్యాన కొత్తపేటలోని పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని గురువారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడం ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీచర్స్ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతుల ఖాతాలో మూడు విడతలుగా నేరుగా రూ.6 వేల పెట్టుబడి సహాయం అందించే కార్యక్రమాన్ని రైతులు, బీజేపీ నేతలు ప్రత్యక్షంగా వీక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు మామిడికుదురు, మొగలికుదురు గ్రామాల్లో బీజేపీ మండల శాఖ ఏర్పాట్లు చేసింది. మండల వ్యవసాయాధికారి బి.మృదుల, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, నేతలు పాల్గొన్నారు.

అంబాజీపేట: రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి, ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని స్థానిక సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ అన్నారు. అంబాజీపేట సొసైటీ కార్యాలయంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా పీఎం మోదీ గురువారం నిర్వహించిన ఇఫ్కో రైతు సమావేశాన్ని, ఆయన, రైతులు వీక్షించారు. పంటలకు విచ్చలవిడిగా ఎరువులు వినియోగించకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని సత్యమోహన్ సూచించారు. పీఎం మోదీ ప్రారంభించిన సల్ఫర్‌తో కూడిన యూరియాను, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ కుంపట్ల అయ్యప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఎంతో మేలు

పి.గన్నవరం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం సత్వరమే ఉచితంగా అందిస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. కుందాలపల్లిలో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలో జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. అర్హులైన 1,540 మందికి వివిధ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ముత్యం వీరాస్వామి నాయుడు మాట్లాడుతూ, కొన్ని కారణాల వల్ల అందుబాటులో లేని పేదలకు పథకాలు అందడం లేదని, వారందరినీ గ్రామసభల ద్వారా గుర్తించి, ప్రభుత్వ లబ్ధిని చేకూర్చేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని అన్నారు. సర్పంచ్ చెల్లుబోయిన హెలీనా, సొసైటీ చైర్మన్ చెల్లుబోయిన బుచ్చియ్య మాస్టారు, తహసీల్దార్ వీవీ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ముగింపు సందర్భంగా మండల, గ్రామ స్థాయి అధికారులకు గుమ్మిలేరులో ఘన సత్కారం జరిగింది. రామాలయం వద్ద సర్పంచ్ గుణ్ణం రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో 739 మందికి వివిధ ధ్రువపత్రాలు అందజేశారు. నెల రోజులుగా ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించిన ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, హౌసింగ్ జేఈ దర్నాల శ్రీనివాస్, ఏఓ ఎస్.లక్ష్మి లావణ్య, డిప్యూటీ తహసీల్దార్ ఎం.జానకి రాఘవ, ఏపీఓ కె.ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

రావులపాలెం: వెదిరేశ్వరం సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 450 మందికి వివిధ ధ్రువపత్రాలు అందజేశామని ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ బొక్కా కరుణాకరం తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ యత్నాలు నిలిపివేయాలి

మలికిపురం: ఏవీఆర్ ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీకి బలవంతంగా భూములు సేకరించే ప్రయత్నాలను నిలిపివేయాలని మానవ హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు చెవ్వాకుల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ పరిశ్రమకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు రాలేదని వారు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయినప్పటికీ భూసేకరణ కోసం రెవిన్యూ అధికారులు గురువారం కేశనపల్లి తీరంలో పర్యటించడంపై అభ్యంతరం తెలిపారు.